జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
ఆదివారం | 27 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 7

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి సెప్టెంబర్26(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా,సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డులను సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం ప్రారంభించి, లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల పరిధిలోని రేజర్ల,రామ గోవిందపురం గ్రామాల్లో కార్డులను పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పాలన ఏర్పడిన నాటినుండి గడపగడపకు సంక్షేమ పథకం అందిందని, స్మార్ట్ రేషన్ కార్డులు వల్ల సంక్షేమ పథకాలు సులభతరంగా లబ్ధిదారులకు అందుతాయి అని, దీనివలన చాలా ఉపయోగాలు ఉండబట్టే ఈ కార్డులను తయారు చేశారని అన్నారు. ఈ విధంగా ప్రజలకు

మిగతా 2 లో...



# చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటితరానికి స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- సమాజంలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ చరిత్ర చిరస్మరణీయం
- చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలలో పాల్గొన్ని, ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సమాజంలోని అసమానతలకు ఎదురొడ్డి, వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం ఖమ్మం, వైరా రోడ్డులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సమీపంలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. జమీందారుల

మిగతా 2 లో...

## ప్రజా జ్యోతి కథనం ప్రభావం..
# అధికారుల విచారణ




- యూరియా వ్యవహారంపై సమగ్ర తనిఖీలు
- రికార్డుల్లో తేడాలు లేవని అధికారుల నివేదిక
- రైతుల నుంచి డబ్బులు తీసుకున్న వ్యవహారంపై చర్యలు
- ఏఈఓ బానోత్ కళ్యాణ్‌పై సస్పెన్షన్ వేటు

**తిరుమలాయపాలెం, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 26:** బీరేలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో యూరియా పంపిణీ వ్యవహారంపై ప్రజా జ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. కథనంలో ప్రస్తావించిన అంశాలపై వ్యవసాయ, సహకార శాఖల అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా యూరియా నిల్వలు, సరఫరా, పంపిణీ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.కుసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు ఈ. రాజేష్‌కుమార, తిరుమలాయపాలెం మండల వ్యవసాయ అధికారి ఎన్.సీతారామిరెడ్డి, సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ కె. కిషోర్ తదితరులు బీరేలు సహకార సంఘాన్ని తనిఖీ చేసి యూరియా నిల్వల రిజిస్టర్, సరఫరా బిల్లులు, చలానాలు, పంపిణీ, విక్రయాల నమోదులను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.అలాగే గోదాములోని భౌతిక యూరియా

మిగతా 2 లో...

## గుదిమాళ్ళ హై స్కూల్ పీటీపై పోక్సో కేసు నమోదు

- జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాటైన కమిటీ లోను అసభ్యకర ప్రవర్తన గుర్తింపు
- రిమాండ్ కు తరలింపు




**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న గుదిమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీపై పోలీసులు శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. చోటుచేసుకున్న ఈ ఘటనపై విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు, ప్రాథమిక విచారణలో వెలుగుచూసిన అంశాల ఆధారంగా పీఈటీపై పోక్సో చట్టంతో పాటు ఇతర సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ అనంతరం న్యాయస్థానంలో హాజరపరచనున్నారు.న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిసింది.

**జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కమిటీ...**

ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డీఈఓ సూచనల మేరకు ఓ కమిటీని కూడా నియమించారు. ఈ కమిటీ ద్వారా విచారణ జరిపిన సదరు కమిటీ సభ్యులు విద్యార్థులు పట్ల జరిగిన అనుచిత ప్రవర్తన వాస్తవమేందనే నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అలాగే సంబంధిత తుది నివేదికను కూడా కలెక్టర్కు అందజేసినట్లు సమాచారం.

# చెరువు కాదు... అది రోడ్డే

- భరణిపాడు ప్రధాన రహదారి పరిస్థితి ఇది
- వాహన దారులు ఇబ్బందులు గ్రామస్తులు ఆవేదన



**వేంసూరు సెప్టెంబర్ 26 ప్రజాజ్యోతి** మండల కేంద్రంలో శివారు ప్రాంతంలో ఉన్న చిట్టి చివరి గ్రామం భరణిపాడు ఇది మండలానికి కాదు రాష్ట్రానికి సరిహద్దులో ఉన్న గ్రామం ఆంధ్రప్రదేశ్లో ఉన్న ఏలూరు జిల్లా కృష్ణాజిల్లా కి రాకపోకలు జరుగుతూ ఉంటాయి చింతలపూడి చాట్రాయి మండలాలకు ఇది ప్రధాన రహదారిగా ఉంది ఎక్కువ రద్దీ వాహనాలు ఎక్కువగా ఇటు సైడ్ వెళ్ళటం వల్ల ప్రధాన రహదారి పరిస్థితి ఈ విధంగా ఉంది ఆదారిపై చినుకు పడితే చిత్తడి చిత్తడే అవుతుంది మరి ముఖ్యంగా ఈ రహదారిలో నీళ్లు నిలిచిపోయి కొన్ని రోజులు వరకు అలాగే ఉంటాయి వాస్తవానికి మర్లపాడు గ్రామం నుండి భరణిపాడు వరకు ఈ రోడ్డు నిర్మాణం జరగవలసి ఉంది కానీ ఈ రోడ్డు కందుకూరు వరకే నిర్మాణం జరిగింది కందుకూరు నుండి ఆంధ్ర సరిహద్దు అయిన ఈ గ్రామం వరకు రోడ్డు నిర్మాణం జరగాలి ఈ నిర్మాణం

మిగతా 2 లో...

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాగమయి



(మొదటి పేజీ తరువాయి...)

సంక్షేమ పథకాలు అందటం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారికి, ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో చిన్న నాగేశ్వరరావు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, రేజర్ల గ్రామ సర్పంచ్ భీమిరెడ్డి అరుణ, మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, రామ గోవిందపురం గ్రామ సర్పంచ్ మౌనిక నరేందర్ రెడ్డి, కొత్తూరు ఉపసర్పంచ్ గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ అభిమానులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకం



(మొదటి పేజీ తరువాయి...)

పాలనలో కొనసాగిన వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. చాకలి ఐలమ్మ సామాజిక సేవకురాలిగా, భూ పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తనదైన పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె పోరాట పటిమ, ధైర్యసాహసాలు మహిళా శక్తికి ప్రతీకగా నిలిచాయని, నేటి తరానికి కూడా ఆమె జీవితం ఆదర్శప్రాయమని అన్నారు. సమాజ హితం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను, సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని చాటి చెప్పారని కలెక్టర్ అన్నారు. ఆమె ఆశయాలు, పోరాట విలువలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి జి.జ్యోతి, బిసి సంఘ నాయకులు తుపాకుల ఎలగొండ స్వామి, జక్కుల వెంకట రమణ, కొత్తకొండ శ్రీలక్ష్మి, తమ్మారపు బ్రహ్మయ్య, సట్టు వెంకటేశ్వర్లు, తెనాలి వీరబాబు, మాచర్ల వేలాద్రి, పగిడల కృష్ణవేణి, కణతాల నరసింహారావు, హరిప్రసాద్, వట్టికోట అప్పారావు, వల్లపు సోమరాజు, అమరగాని వెంకటేశ్వర్లు, లింగబోయిన పుల్లారావు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, బిసి కుల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరవనిత చాకలి ఐలమ్మ 131 వ జయంతి వేడుకలు

- చాకలి ఐలమ్మ ను తెలంగాణ తల్లి గా ప్రభుత్వం అధికారంగా ప్రకటించాలి
- టీ డబ్ల్యు యం ఎఫ్ జిల్లా ఇంచార్జీ గుండా ఉపేందర్ రెడ్డి



**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి** వీరవనిత, చాకలి ఐలమ్మ 131 వ జయంతి సందర్భంగా శనివారం కూసుమంచి మండల కేంద్రంలో గ్రామ పెద్దలతో కలసి ఆమె చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా వినమ్ర నివాళులు అర్పించారు. నిజాం నిరంకుశ పాలనలో పాలకుర్తి లో విసునూరు రామ చంద్ర రెడ్డి భూస్వాముల , గడిల, దొరల పాలనకు వ్యతిరేకముగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని , స్వతహాగా తన బిడ్డల ఆకలి తీర్చడం కోసం కొంత భూమిని సాగు చేయటం సహించని పెత్తందారుల ను ఎదురొడ్డి, ఆమె చేసిన పోరాటాలు నేటి భవిష్యత్ తరాలకి స్ఫూర్తిదాయకం. నాడు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆమె పోరాట పటిమను స్ఫూర్తిదాయకంగా తీసుకొని, నేడు ఆమె వారసులుగా ప్రభుత్వం వ్యతిరేక విధానాలు పట్ల పోరాటం చేయాలని, అదేవిధంగా తమ హక్కుల సాధన కోసం అందరూ కలిసి ఐకమత్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా చాకలి ఐలమ్మ ను తెలంగాణ తల్లిగా గుర్తించడం, ప్రతి మండల కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహాల ఏర్పాటు, ఇప్పటికీ రజక వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న రజక సోదర సోదరీమణులకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విశ్వకర్మ యోజన పథకం ద్వారా అందిస్తున్న వాషింగ్ మెషీన్లు, వివిధ పరికరాలు, తక్కువ వడ్డీకే ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణాలు ఎలానో అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా వారికి వాషింగ్ మెషీన్లు, ఉచిత విద్యుత్, సంఘాలకు సహకార రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు రావుల ఉమా, మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్, గంజి ఉదయ్ కుమార్, కొక్కిరేణి రామస్వామి, కొక్కిరేణి వీరభద్రం, తంగేళ్ల చంద్రయ్య కొక్కిరేణి వీరన్న , కొక్కిరేణి పిచ్చయ్య ,సీతయ్య, సత్యం, గొల్లపూడి శ్రీకాంత్ , కొక్కిరేణి వినోద్, కొక్కిరేణి మంగమ్మ, భద్రకాళి, ఎల్లమ్మ, కొక్కిరేణి గురవమ్మ, కొక్కిరేణి రమేష్, బద్దం వెంకటరెడ్డి, మంద చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసీ తీరుపై సీపీఎం ధ్వజం

- జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్



**కల్లూరు, సెప్టెంబర్ 26 : ప్రజా జ్యోతి** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు సెంటర్ లో సీపీఎం డివిజన్ కార్యదర్శివర్గ సభ్యుడు తన్నీరు కృష్ణార్జునరావు అధ్యక్షతన వారి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా వ్యవహరించడంలో విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం కలిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. తన్నీరు కృష్ణార్జునరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి దోమతోటి పుల్లయ్య, సామినేని హనుమయ్య, తిగుళ్ల బాబు, గంపల శ్రీనివాసరావు, తన్నీరు కృష్ణవేణి, సామినేని వీరభద్రం, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు శీలం పకీరమ్మ, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## చెరువు కాదు అది రోడ్డే

(మొదటి పేజీ తరువాయి...)



జరగకపోవడం వల్ల రోడ్డు అంతా ఎక్కడ కక్కడే పాడైపోయింది కొన్ని భారీ వాహనాలు ఈ రోడ్డు వైపు తిరగటం వల్ల కూడా రోడ్డు డ్యామేజ్ జరిగిందని గ్రామస్తులు చెప్పుకొచ్చారు ఏది ఏమైనా ఎప్పటి నుంచో రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తులకు ఈ సంవత్సరం కూడా నిర్మాణం జరుగుతుంది అని ఆశ పడ్డారు కానీ జరగలేదు. దీనివల్ల వాహనదారులు ప్రయాణికులు చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఎదుర్కొంటున్నారు ముఖ్యంగా వర్షం వస్తే ఒక చెరువు లాగా అక్కడ రోడ్డు మారుతుంది బయట నుండి వచ్చే వారికి ఇది రొడ్డ చెరువు అనే అనుమానం కూడా వస్తుంది రాత్రి సమయంలో ప్రయాణం చేసే వారు ఆ నీళ్ల ద్వారా ఎటు వెళ్ళాలో తెలియకుండా అనేకసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి కందుకూరు గ్రామం నుండి అయిదు కిలోమీటర్ మేరకు ఈ నిర్మాణం జరిగినట్లయితే ఆంధ్ర తెలంగాణ సరిహద్దులకు మూలమైన ఈ గ్రామం నుంచి రాకపోకలు యదా విదిగా సాగే అవకాశం ఉంది చాలా వరకు వాహనాలు వాహనదారులు ఈ ప్రాంతం గుండా వెళుతుండటం వల్ల ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం వారు చర్యలు తీసుకొని అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డు నిర్మాణం జరిగేవిధంగా చూడాలని గ్రామస్తులు ఎప్పటి నుంచో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజా జ్యోతి కథనం ప్రభావం.. అధికారుల విచారణ

(మొదటి పేజీ తరువాయి...)

నిల్వలను రికార్డుల్లో నమోదైన వివరాలతో సరిపోల్చి చూశారు. ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని నిల్వ వివరాలతోనూ పోల్చి పరిశీలించినట్లు వెల్లడించారు. ఈ పరిశీలనలో రికార్డుల్లో నమోదైన నిల్వలకు, గోదాములోని భౌతిక నిల్వలకు మధ్య ఎలాంటి తేడాలు గుర్తించలేదని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. అదేవిధంగా యూరియా నిల్వలను పక్కదారి పట్టించినట్లు లేదా అనధికారికంగా పంపిణీ చేసినట్లు ఆధారాలు లభించలేదని అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం.

**రైతుల నుంచి డబ్బులు తీసుకున్న అంశంపై చర్యలు....**

అయితే రైతుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణల అంశాన్ని అధికారులు ప్రత్యేకంగా పరిశీలించినట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి. ఏఈవో బనోత్ కళ్యాణ్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. యూరియా నిల్వలు, పంపిణీ రికార్డుల్లో తేడాలు లేవని విచారణ నివేదికలో పేర్కొన్నప్పటికీ, రైతుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు వచ్చిన అంశంపై సంబంధిత అధికారిపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవ డం చర్చనీయాంశంగా మారింది. ప్రజా జ్యోతి కథనంతో అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టడం, రికార్డులను పరిశీలించడం, అనంతరం రైతుల నుంచి డబ్బులు తీసుకున్న అంశంపై బనోత్ కళ్యాణ్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకున్న ట్లు ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. శాఖాపరమైన విచారణలో ఈ వ్యవహారానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# కుటుంబ కలహాల తో దారుణం...!

- భార్యపై కత్తిపీటతో దాడి చేసిన భర్త.
- పరిస్థితి విషమం ఖమ్మం తరలింపు.

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి :** కుటుంబ తగదాల నేపథ్యంలో భర్త అగ్రహంతో దారుణం కు పాల్పడ్డాడు. భార్య పై కత్తిపీట తో దాడి చేసి గాయపరిచిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలం లోని పైనంపల్లి గ్రామానికి చెందిన సిద్దెల వీరలక్ష్మి (25) కి తిరుమలాయపాలెం మండలం లోని బీరోలు గ్రామానికి చెందిన నరసింహారావు తో వివాహమైంది. వారికి ఇరువురు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా భార్య-భర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో కుటుంబ కలహాల కారణంగా గత పది రోజుల క్రితం తల్లిదండ్రుల నివాసమైన పైనంపల్లి గ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటోంది. ఈ నేపథ్యంలో శనివారం భర్త నరసింహారావు తన భార్య వద్ద కు వచ్చి ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో



కోపాద్రిక్తుడై ఆమె కూరగాయలు కోస్తుండుగా.. అదే కత్తి పీట ను తీసుకుని మెడ పై బలంగా దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలైన వీరలక్ష్మి నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రధమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. దాడి చేసిన భర్త ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# సమస్యల పరిష్కారంలో కాలయాపన తగదు

- ఒప్పందం ప్రకారం రెండు డీఎలను విడుదల చేయాలి
- సిపిఎస్ విధానాన్ని రద్దు చేయుటకు కమిటీ వేయాలి
- ఉపాధ్యాయులపై బోధనేతర ఒత్తిడి తగ్గించాలి
- టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ



**బోనకల్, సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి)** :ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కాలయాపన తగదని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ అన్నారు. శనివారం బోనకల్ మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు తదనంతరం ముఖ్యమంత్రి , డిప్యూటీ సీఎం ప్రభుత్వ అధికారులు జరిపిన చర్చలో చేసుకున్న ఒప్పందాల మేరకు సంబంధిత జీవోలు విడుదల చేయడంలో కాలయాపన తగదని, పెండింగ్ లో ఉన్న మిగతా డి ఏ లను కూడా ఇవ్వాలని, జేఏసీ చర్చల్లో జరిగిన ఒప్పందం ప్రకారం రెండు డి ఏ లను విడుదల చేస్తూ సంబంధిత జీవోలను విడుదల చేయాలని, పెండింగ్ బిల్లుల సత్వర పరిష్కారానికై ప్రతినెల 2000 వేల కోట్లు కేటాయించాలని, , పి ఆర్ సి రిపోర్టును వెంటనే కమిటీ సమర్పించే విధంగా తగిన సూచనలు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు పరచుటకై కమిటీని వేయాలని, బీసీ గురుకుల టైం టేబుల్ మార్చాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పై ఇవ్వాలని, ఉపాధ్యాయులపై బోధనేతర పని ఒత్తిడిని తగ్గించాలని, గురుకుల ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో హెడ్ ద్వారా వేతనాలు ఇవ్వాలని, కేర్ టేకర్స్ ను నియమించాలని, హెల్త్ కార్డులు హెచ్ ఎస్ హాస్పిటల్ లో అమలయ్యే విధంగా సంబంధిత ఆసుపత్రులకు తగిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు సదాబాబు, మండల అధ్యక్షులు చిన్న రంగారావు, మండల ఉపాధ్యక్షులు పి గోపాలరావు, మండల ఉపాధ్యక్షురాలు కె. సౌభాగ్య లక్ష్మి, మండల కోశాధికారి పి నరసింహారావు, నరేంద్ర సింహ సీనియర్ నాయకులు నాగ మహేష్, ఉపాధ్యాయులు హరికృష్ణ, ఎం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య రంభ సంరక్షణ ,విద్య అంగన్వాడీ కేంద్రాల లక్ష్యం

- సూపర్వైజర్ సంధ్యారాణి



**చింతకాని సెప్టెంబర్26(ప్రజా జ్యోతి )**చిన్నారుల బాల్యారంభ సంరక్షణ ,విద్య అంగన్వాడీ కేంద్రాల లక్ష్యమని ఐసిడిఎస్ చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు. శనివారం చింతకాని మండల పరిధిలోని నాగిలిగొండ 1,2 అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్లు అలివేలు మంగ, లేయమ్మా ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో సంధ్యారాణి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తూ, ఆట పాటలతో, పిల్లల నైపుణ్యాభివృద్ధిని పెంచే విధంగా విద్యాబోధన నిర్వహిస్తున్నామని అన్నారు.విద్యను అభ్యసించే 3నుంచి 6 సంవత్సరముల విద్యార్థులకు అంగన్వాడీ టీచర్లు నేర్పించిన ఆట ,పాట ,మంచి అలవాట్లు ,సంభాషణ, కథలు ,శాస్త్రీయ పరిజ్ఞానం, సాంస్కృతిక కార్యక్రమాలు, పూర్వ గణిత భావనలు, సృజనాత్మకత తదితర అంశాలపై విద్యార్థులు తల్లుల సమక్షంలో విద్యార్థులచే ప్రదర్శింప చేసి చిన్నారుల అభివృద్ధి ప్రతిభా పాటవాలను, స్వయముగా తల్లులు తెలుసుకునే విధంగా నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అన్నప్రాసన వేడుకలను నిర్వహించారు. ఆయా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

- నివాళులర్పించిన కళాశాల సిబ్బంది
- మహిళలు చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి
- కళాశాల ప్రిన్సిపాల్ లింగమనేని నళిని శ్రీ



**బోనకల్, సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి ):**మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అంతోటి తిరుపతి రావు ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ లింగంనేని నళిని శ్రీ అధ్యక్షతన శనివారం చిట్యాల ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లింగంనేని నళిని శ్రీ మాట్లాడుతూ... మనము తెలంగాణ చరిత్రలో ఒక గొప్ప మహిళా యోధురాలు ధైర్యానికి, ఆత్మ గౌరవానికి ప్రత్యేకగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతినీ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు. చిట్యాల ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో ప్రముఖ మహిళా, నిజాం పాలన కాలంలో, గ్రామీణ ప్రజలు భూస్వాముల పెత్తనం, వెట్టిచాకిరి, అధిక పన్నులు, అనేక రకాల సామాజిక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నా అటువంటి పరిస్థితుల్లో తన హక్కుల కోసం అన్యాయానికి వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా నిలబడ్డారని అన్నారు. ఐలమ్మకు చెందిన భూమిపై భూస్వామ్య శక్తులు హక్కు సాధించడానికి ప్రయత్నించినప్పుడు ఆమె వెనక్కి తగ్గలేదన్నారు. తన భూమిని కాపాడుకోవడానికి ఆమె చేసిన పోరాటం ప్రజల్లో ధైర్యాన్ని నింపింది ఆమె పోరాటం కేవలం తన కుటుంబం కోసం మాత్రమే కాకుండా అన్యాయాన్ని ఎదుర్కొంటున్న సామాజిక ప్రజల ఆత్మగౌరాణి పతేగా మారింది. భూస్వాముల పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడారు. ఈ పోరాటంలో ఆమె ముందుండి భూస్వామ్య దోపిడీ వెట్టిచాకిరి మరి సామాజిక న్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్య పెరిగేలాగా ఆమె పోరాటం ప్రత్యేక ప్రాథమిక పొందిందన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ జీవితం నుంచి మన ముఖ్యంగా నాలుగు విషయాలు నేర్చుకొని అన్యాయం, మన హక్కులు, కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడటం, సమాజంలో సమానత్వం ఆత్మగౌరం కోసం కృషి చేయాలన్నారు. ఆమె ఒక స్ఫూర్తి అణగారిని ప్రజల హక్కుల కోసం తన ఆత్మ వరం కోసం ధైర్యంగా నిలబడిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. అన్యాయం ముందు తలవంచకూడదు హక్కుల కోసం ధైర్యంగా నిలబడాలని చెప్పేవారు అని తెలియజేశారు. కళాశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనంలో డమ్మీ కత్తితో డ్యాన్స్

- వ్యక్తిపై కేసు నమోదు

**రఘునాథపాలెం, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** వినాయక నిమజ్జన ఊరేగింపులో డమ్మీ కత్తితో డ్యాన్స్ చేసిన వ్యక్తిపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సెప్టెంబర్ 24న పువ్వాడ ఉదయ్ నగర్ గ్రామంలో షేక్ రఫీ (39) డమ్మీ కత్తితో డ్యాన్స్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు చర్యలు చేపట్టారు.బహిరంగ ప్రదేశాల్లో ఆయుధాలు లేదా వాటిని పోలిన వస్తువులను ప్రదర్శించడం నేరమని సీఐ ఉస్మాన్ షరీఫ్ హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేయడంతో పాటు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## 3లక్షల ఎంపీ నిధులతో సైడ్ డ్రైనేజీ నిర్మాణం

- ప్రారంభించిన సర్పంచ్ టోని, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు



**కారేపల్లి, సెప్టెంబర్ 26, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల కేంద్రంలో శివాలయం పక్క సందులో రూ.3 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సైడ్ డ్రైనేజీ కాలువను శనివారం స్థానిక సర్పంచ్ మేదరి వీరప్రతాప్(టోనీ), సింగరేణి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ కాలువ నిర్మాణంతో వర్షపు నీరు, మురుగు నీరు సాఫీగా వెళ్లేందుకు అవకాశం ఏర్పడి స్థానికులకు ఇబ్బందులు తగ్గనున్నాయని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూరి రాంబాబు, నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, ఎండి యాకూబ్, పెద్దమ్మ భాగ్యలక్ష్మి, తాజుద్దీన్,తొగర శ్రీను, విజయ్, అదేర్ల అంజయ్య, కాంట్రాక్టర్ గుగులోత్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బెటాలియన్ లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**సత్తుపల్లి సెప్టెంబర్26(ప్రజా జ్యోతి )**మండల పరిధిలోని గంగారం గ్రామపంచాయతీ లో గల 15వ బెటాలియన్ లొ ఘనంగా చాకలి ఐలమ్మ గారి జయంతి వేడుకలు శని వారం నిర్వహించినారు. చిట్యాల ఐలమ్మగారి 131వ జయంతి వేడుకలు ఘనంగా ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పటాలపు కమాండెంట్ ఎన్.పెద్ద బాబు పాల్గొని శ్రీ చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ అంటేనే ఒక తెగువ ఒక పోరాటం అటువంటి తెలంగాణలో 1949వ సంవత్సరములో జరిగిన ప్రజా ఉద్యమము భారతదేశములోనే ఒక కీలక ఘట్టం ఆనాటి సాయుధపోరాటం ప్రపంచ దృష్టినే ఆకర్షించిందంటే సామాన్యరాయులైన చాకలి ఐలమ్మ గారి పోరాటం ఆమె చూపించిన తెగువ సాయుధ పోరాటానికి ఎంతగానో స్ఫూర్తినిచ్చిందని అటువంటి పోరాటయోధురాలైన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వపు ఆదేశాల మేరకు జరుపుకోవటం ఎంతగానో సంతోషాన్నిచ్చిందని వివరించారు. అటువంటి మహనీయురాలి ఆశయ సదనకై మనమందరము కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అదనపు కమాండెంట్ ఎ.అంజయ్య అసిస్టెంట్ కమాండెంట్ బి.వేణుగోపాల రెడ్డి,ఆర్ ఐ లు మరియు పరిపాలన అధికారులు మరియు ఆర్ఎస్ఐ లు పటాలపు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

## ఐలమ్మ జీవితం నేటి తరంకు ఆదర్శం

- మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి:** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరం కు ఆదర్శమని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు కొనియాడారు. మండల కేంద్రంలో శనివారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమం ను నిర్వహించారు. ఆమె విగ్రహం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడారు.. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఐలమ్మ గుర్తిస్తూ ప్రభుత్వం అధికారికంగా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు కాసాని నాగేశ్వరరావు, బచ్చలకూరి నాగరాజు, మేకల వెంకటేశ్వర్లు, పాగర్తి సుధాకర్, జెర్రిపోతుల అంజని, కట్టెకోల నాగార్జున, మారిశెట్టి వెంకటేశ్వరరావు, కడియాల నరేష్, సూరేపల్లి జ్ఞానరత్నం, గరిడేపల్లి రామారావు, మల్లెబోయిన గోవిందరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు కొండా హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయి

- కొనుగోలు చేసిన ప్రతీ బస్తాకు రశీదులు ఇవ్వాల్సిందే



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి :**నకిలీ ఎరువులను విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని మండల వ్యవసాయాధికారి యం.రాధ హెచ్చరించారు. మండల కేంద్రం లోని వివిధ ఎరువుల దుకాణాలను శనివారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎరువుల ధరల పట్టిక ను పరిశీలించారు. రికార్డుల ప్రకారం స్టాక్ ఉందా లేదా తెలుసుకోవటానికి గోడౌన్ లను తనీఖీ చేశారు. దుకాణాల యజమానులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులకు నకిలీ ఎరువులు విక్రయించి ఎవరైనా మోసం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎరువుల ధరలను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే సహించేది లేదన్నారు. రైతులు తీసుకున్న ప్రతీ బస్తాకు రశీదులు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వ్యవసాయ విస్తీరణాధికారులు, పెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్స్ ఉన్నారు.

## లడ్డూ రూ.1, 20, 116 వేలం కైవసం



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి:**మండలం లోని రాజారాం పేట గ్రామంలో శనివారం వినాయక విగ్రహం ను నిమజ్జనం చేశారు. మండపం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన కుండా నారాయణ, ముక్కిరాల రామయ్య, వెన్నబోయిన నాగేశ్వరరావు, బండ్ల నాగయ్య, బొల్లా పెద్ద వెంకటి లు సమూహంగా రూ.1,20,116 లకు వేలం లో దక్కించుకున్నారు. పంచాయతీ సర్పంచ్ రాయపూడి రామారావు ఆధ్వర్యంలో కార్యక్రమం ను నిర్వహించారు. అనంతరం కోలాటం, డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలం లోనే అతి చిన్న గ్రామమైన 400 –జనాభా కలిగిన ఈ గ్రామంలో పెద్ద మొత్తంలో లడ్డూ వేలం పాట నిర్వహించటం చర్చంశనీయంగా మారింది.

## అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అక్షరాభ్యాసం, శ్రీమంతం వేడుకలు



**వేంసూరు:సెప్టెంబర్ 26 ప్రజాజ్యోతి** మండల పరిధిలోని అంబేద్కర్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం అక్షరాభ్యాసం మరియు శ్రీమంతం కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేంసూరు సర్పంచ్ ఎండి. ఫకృద్దీన్ విచ్చేసి మాట్లాడారు. అలాగే అంగన్వాడీ సీడీపీఓ (CDPO) సత్యవతి, సూపర్‌వైజర్ కమల పాల్గొని, చిన్న పిల్లలకు పలకా బలపాలు అందించి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సాంప్రదాయబద్ధంగా శ్రీమంతం వేడుకను నిర్వహించి పండ్లు, తాంబూలాలు అందించారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల ప్రాథమిక విద్యకు, గర్భిణులు మరియు బాలుర ఆరోగ్య రక్షణకు వేదికలుగా నిలుస్తున్నాయని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈడ కొండల్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెల్లి నరసింహాస్వామి, వార్డు మెంబర్ పిల్లి రమణ, అంగన్వాడీ సిబ్బంది, హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, చిన్నారులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఘరానా ఆయిల్ దొంగతనం ముఠా అరెస్ట్

- మోసపూరితంగా పామ్ ఆయిల్ అక్రమ విక్రయాలు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఆయిల్ ట్యాంకర్ నుంచి మోసపూరితంగా పామ్ ఆయిల్ మళ్లించి అక్రమంగా విక్రయిస్తున్న ముఠా గుట్టును ఖమ్మం పోలీసులు రట్టు చేశారు.

**›› ఘటన వివరాలు:**

గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజర్ ఒకలుపూడి రామచంద్రరావు ఫిర్యాదు మేరకు ఖానాపురం హవేలీ పోలీసులు క్రైమ్ నంబర్ 534/2026 కింద కేసు నమోదు చేశారు. ఆర్బీడీ పామ్ ఆయిల్ ట్యాంకర్ (AP39TU6599) డ్రైవర్ ఇతరులతో కలసి కుట్ర పన్ని, సరుకును అక్రమంగా విక్రయించి కంపెనీకి ఆర్థిక నష్టం కలిగించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**›› మోడస్ ఆపరేంటి (నేర పద్ధతి):**

నిందితులు ఎంతో తెలివిగా మొదటి తూకం సమయానికి ట్యాంకర్‌లో నీటి బాటిళ్లు, రాళ్లు పెట్టి బరువు పెంచేవారు.తూకం పూర్తయిన తర్వాత సరుకు ఆయిల్ నింపి, ముందుకు వెళ్లి ట్యాంకర్ నుంచి ఆ బాటిళ్లను,రాళ్లను తొలగించేవారు.రవాణా సమయంలో ట్యాంకర్ వాల్వ్‌లను అక్రమంగా మేనేజ్ చేసి, కొంత ఆయిల్‌ను తీసి ఇతర నిందితులకు విక్రయించేవారు.ఇటీవల సెప్టెంబర్ 22 రాత్రి ఖమ్మం అవుట్ స్కర్ట్స్‌లో ట్యాంకర్ నుంచి 31 కేన్ల లో ఆయిల్‌ను నింపి, నిందితుడు ఎ 2 రూ. 40,000 అడ్వాన్స్‌ను ఫోన్‌పే ద్వా రా చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు.

**›› అరెస్టయిన నిందితులు:**

ఎ 1 షేక్ కమరుద్దీన్ ట్యాంకర్ యజమాని డ్రైవర్ ఎ 2 చిదెళ్ల కనకయ్య ఆయిల్ వ్యాపారి,కోదాడ ఎ 3 బతిని గోపినాథ్ ఆటో యజమాని,డ్రైవర్ ఎ 4 దారా శ్రీనివాసరావు ఎ 2 వద్ద ఉద్యోగి మరో 8 మంది ఎ –5 నుండి ఎ –12 వరకు పరారీలో ఉన్నట్లు, నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**›› సీజ్ చేసిన ఆస్తులు:**

ఆర్ బి డి పామ్ ఆయిల్ ట్యాంకర్ (AP39TU6599) ఆటో (TS29T 1812) 31 ఆయిల్ కేన్లు 4 మొబైల్ ఫోన్లు రూ 1,000 నగదుఈ అక్రమ విక్రయం ద్వారా ఎ –1 కమరుద్దీన్ రూ 1,50,000 పొందగా, కోదాడ, సూర్యాపేట పరిసర ప్రాంతాల్లో అక్రమ మార్కెటింగ్ చేయడం ద్వారా ఎ –2 కనకయ్య రూ 5,50,000 లాభం పొందినట్లు ట్రాన్సాక్షన్ రికార్డులు చూపిస్తున్నాయని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఖమ్మం టౌన్ తెలిపారు. ఈ కేసులో ఇతర ప్రమేయాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## ఈదురుగాలులు, వర్షంతో విద్యుత్ లైన్లకు నష్టం

- అత్యవసరంగా రంగంలోకి దిగిన విద్యుత్ సిబ్బంది
- రాత్రివేళల్లోనూ పునరుద్ధరణ పనులు








**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం పట్టణంలో ఇటీవల ఏర్పడిన విద్యుత్ అంతరాయాలు సాధారణ విద్యుత్ కోతలు కావని,ఈదురుగాలులు,దుమ్ము, వర్షం కారణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థ దెబ్బతినడంతో తాత్కాలికంగా సరఫరాకు అంతరాయం ఏర్పడిందని సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, ఖమ్మం ఇనుగుర్తి శ్రీనివాస చారి తెలిపారు.గురువారం ఖమ్మం పట్టణ పరిధిలో వీచిన ఈదురుగాలులు, కురిసిన వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో చెట్లు, చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లపై పడటంతో లైన్లు తెగిపోవడం, విద్యుత్ పరికరాలు దెబ్బతినడం వంటి సమస్యలు ఏర్పడ్డాయని ఆయన వివరించారు.యూపీహెచ్ కాలనీ, బాలాజీనగర్, ఇండస్ట్రియల్ ఏరియా, ఖానాపురం, బల్లేపల్లి తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఏర్పడినట్లు తెలిపారు. సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, ప్రమాదాలకు అవకాశం లేకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టిన అనంతరం మరమ్మతు పనులను ప్రారంభించారు.విద్యుత్ లైన్లపై పడిన చెట్లు, చెట్ల కొమ్మలను తొలగించడం, తెగిపోయిన లైన్లను సరిచేయడం, దెబ్బతిన్న పరికరాలను పునరుద్ధరించడం వంటి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు ఎస్ ఈ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు రాత్రిపూట ఏర్పడినప్పటికీ, వాటిని అత్యవసర ఫిర్యాదులుగా పరిగణించి సిబ్బంది రాత్రి వేళల్లోనే క్షేత్రస్థాయికి చేరుకుని పునరుద్ధరణ పనులు చేపట్టారని పేర్కొన్నారు.పునరుద్ధరణ పనులను సంబంధిత డివిజనల్ ఇంజనీర్లు , అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు , బల్లేపల్లి,రఘునాథపాలెం, కొత్తలింగాల ఏఈలు మరియు ఆయా సెక్షన్ల సిబ్బంది సమన్వయంతో నిర్వహించినట్లు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తూ మరమ్మతు పనులను వేగవంతం చేశారని చెప్పారు.ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ లైన్లు దెబ్బతిన్నప్పుడు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని ఎస్ ఈ స్పష్టం చేశారు. విద్యుత్ లైన్లపై చెట్లు పడటం లేదా లైన్లు తెగిపోవడం వంటి సందర్భాల్లో ముందుగా ప్రమాదకర పరిస్థితిని నివారించి, విద్యుత్ సరఫరాను సురక్షితంగా నిలిపివేసిన అనంతరం మాత్రమే మరమ్మతు పనులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించాల్సి ఉంటుందని వివరించారు.వినియోగదారులు విద్యుత్ అంతరాయా లు లేదా అత్యవసర పరిస్థితులను వెంటనే సంబంధిత LMC నంబర్ 8712483 490 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912కు తెలియజేయాలని ఎస్ ఈ సూచించా రు. అందిన ఫిర్యాదులపై సంబంధిత సిబ్బంది తక్షణమే స్పందించి,పరిస్థితిని బట్టి అత్యవసర ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపడతారని తెలిపారు.ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ వినియోగదారులకు విద్యుత్ సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలకు నిరంతర మరియు సురక్షితమైన విద్యుత్ సరఫరా అందించేందుకు శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని ఎస్ ఈ శ్రీ ఇనుగుర్తి శ్రీనివాస చారి తెలిపారు.

## ఖమ్మం జిల్లా జైలులో సెక్యూరిటీ రివ్యూ కమిటీ సమావేశం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా జైలులో శనివారం ఉదయం 11.00 గంటలకు సెక్యూరిటీ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఖమ్మం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లా అండ్ ఆర్డర్ రామానుజం చైర్మన్‌గా వ్యవహరించారు. సమావేశంలో ప్రతి సంవత్సరం జైలు భద్రతపై చర్చించే క్రమంలో భాగంగా,ఈసారి కూడా పలు కీలక అంశాలపై చర్చించారు. జైలులోని ముద్దాయిలను విచారణ,వాయిదాల నిమిత్తం కోర్టులకు తీసుకెళ్లడం, అనారోగ్య కారణాల వల్ల ఆస్పత్రులకు పంపే సమయంలో జైలు సిబ్బందికి,పోలీస్ సిబ్బందికి మధ్య ఉండాల్సిన సమన్వయం, సహాయ సహకారాలపై జిల్లా జైలు పర్యవేక్షణాధికారి ఎ. శ్రీధర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. అనంతరం డీసీపీ రామానుజం మాట్లాడుతూ జైలు భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఖైదీల భద్రత, జైలు ప్రాంగణ రక్షణ విషయంలో అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు.అనంతరం కమిటీ సభ్యులు జైలు ప్రాంగణాన్ని అంతటా తిరిగి పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేశారు. హాజరైన అధికారులు ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుశీల్ సింగ్,టౌన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రమణమూర్తి,ఆర్.ఐ.కామరాజు,ఖానాపురం సబ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ భాను ప్రకాష్ ఖమ్మం జిల్లా జైలు పర్యవేక్షణాధికారి ఎ.శ్రీధర్,జైలరు,డిప్యూటీ జైలర్లు ఏ.సక్రు,ఏ.సుభాష్,కె.హనుమంతరావు,ఎం. వెంకటేశ్వర్లు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# అమరవాదిపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం

- ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రకటనలు మానుకోవాలి
- కొదుమూరి జగన్నాథం గుప్తా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణపై కొందరు వ్యక్తులు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొదుమూరి జగన్నాథం గుప్తా అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్యవైశ్య మహాసభ బలోపేతానికి ఏనలేని కృషి చేశారు అమరవాది . ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం విడిపోయిన అనంతరం సభ్యత్వాలను పెంచడం, లీగల్‌గా ఎదురైన ఇబ్బందులను పరిష్కరించడం, సంఘాన్ని పటిష్టం చేయడం వంటి అనేక అంశాల్లో అమరవాది లక్ష్మీ నారాయణ కృషి చేశారని తెలిపారు. ఆ సమయంలో ప్రభుత్వ సహకారంతో 5 ఎకరాల స్థలం సాధించడంలో కూడా విజయం సాధించారని పేర్కొన్నారు. సమాజ కార్యక్రమాల కోసం అమరవాది తన సొంత ఖర్చులతో, సొంత నిధులతో తిరుగుతున్నారని, ఎలాంటి అపచర్యలకు పాల్పడలేదని, నిధుల దుర్వినియోగం జరగలేదని స్పష్టం చేశారు.దొంగ లేదా డూప్లికేట్ సభ్యత్వాల పేరుతో నిరాధార ఆరోపణలు చేస్తూ ఆర్యవైశ్య సమాజంలో అపోహలు సృష్టించడం సరికాదని జగన్నాథం గుప్తా అన్నారు. ఆర్యవైశ్య ఆత్మీయ భవనం, తిరుమలలో తెలంగాణ భవనం, చింతల్‌బస్తీలోని భవనం రినోవేషన్ వంటి సమాజ అభివృద్ధి కార్యక్రమాలకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన దాతల సహకారాన్ని పదవులతో ముడిపెట్టడం తగదన్నారు.పదవులను ఎవరూ డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని, సభ్యత్వాల సేకరణపై కూడా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ద్వారా ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయవద్దని సూచించారు. ముఖ్యంగా, అమరవాది కార్యవర్గంలో గతంలో పనిచేసిన వారు ఇన్ని సంవత్సరాల పాటు ఎందుకు మౌనంగా ఉండి ఇప్పుడు మాత్రమే ఈ ఆరోపణలు చేస్తున్నారో సమాజానికి వివరించాల్సిన అవసరం ఉందన్నారు.చింతల్‌బస్తీలోని భవనాన్ని తెలంగాణకు కేటాయించాలనే అంశంపై అమరవాది లక్ష్మీ నారాయణ పోరాటం చేశారని, ఉప్పల్ భగాయత్‌లో స్థలం కేటాయింపునకు సంబంధించి అప్పటి ప్రభుత్వ హయాంలో జీవో జారీ అయిందని తెలిపారు. సమాజ అభివృద్ధికి సంబంధించిన నిర్మాణ కార్యక్రమాలు ముందుకు సాగుతున్న సమయంలో రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలు చేయడం వల్ల సమాజానికే నష్టం జరుగుతుందని అన్నారు. కోర్టు ప్రక్రియకు అనుగుణంగా ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడినప్పుడు ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ముఖ్యమంత్రి లేదా ఇతర ప్రముఖులు హాజరైన సమాజ కార్యక్రమాలను కూడా రాజకీయ కోణంలో విమర్శించడం కంటే,వాటి ద్వారా ఆర్యవైశ్య సమాజానికి కలిగే ప్రయోజనాలను చూడాలని సూచించారు.ఆర్యవైశ్యులు ఎవరు ఏం చెప్పినా నమ్మే పరిస్థితిలో లేరని, ప్రతి విషయాన్ని ఆలోచించి, పరిశీలించి నిర్ణయం తీసుకునే సమాజం ఆర్యవైశ్య సమాజమని కొదుమూరి జగన్నాథం గుప్తా అన్నారు. 12 సంవత్సరాలు అధికారంలో ఉండి ఏమీ చేయలేదని చెప్పడం సబబు కాదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సభ్యత్వాల విస్తరణ, న్యాయపరమైన సమస్యల పరిష్కారం, సంఘ పటిష్టతతో పాటు భవిష్యత్ నిర్మాణాలకు పునాది వేసే కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. తిరిగి అధికారంలోకి రావాలనుకునే వారు ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టి ఆర్యవైశ్యుల మనసులు గెలుచుకోవాలని సూచించారు. ఎన్నికలు మళ్లీ వస్తాయని, అప్పుడు తమ పనితీరును ప్రజల ముందు ఉంచి మద్దతు కోరవచ్చని, ఎవరిని ఎన్నుకోవాలో ఆర్యవైశ్య సమాజమే నిర్ణయిస్తుందని అన్నారు.

## ఏఐఎస్ఎఫ్ 90 వ వార్షికోత్సవాల ముగింపు గోడపత్రికను ఆవిష్కరణ




**కారేపల్లి, సెప్టెంబర్ 26, ప్రజా జ్యోతి :** స్వాతంత్ర్య సంగ్రామంలో విప్ల వాగ్ని రగిలించిన నిప్పుకణం, ప్రత్యేక తెలంగాణ సాధనకు తొలి దశ,మలి దశ ఉద్యమం లో వీరోచిత పోరాటం చేసిన సంఘం,దేశ చరిత్రలో ఎందరో త్యాగధనులను అందించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నంశెట్టి ఆకాష్ పేర్కొన్నారు. సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో శనివారం గిరి ప్రసాద్ భవన్ లో ఈనెల 28,29, 30, తేదీల్లో హనుమకొండ లో జరుగును ఏఐఎస్ఎఫ్ 90,వార్షికోత్సవాల ముగింపు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అలుపెరగని సమరశీల ఉద్యమాల వేదిక, దేశానికి ఎందరో త్యాగదనులను అందించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమ వారసత్వంతో నిత్యం విద్యా రంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరిగని పోరాటాలు నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు.స్వాతంత్రం మా జన్మ హక్కు అంటూ స్వాతంత్రం కోసం జరిగిన సంగ్రామంలో ఉద్యమించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. విద్యారంగంలో సంస్కరణల కోసం పోరాడి, కొఠారి కమిషన్ సిఫారసుల అమలు చేయాలని పోరాటం చేసిన ఘనమైన చరిత్ర ఏఐఎస్ఎఫ్ దే అన్నారు . చదువుతూ పోరాడు చదువు కై పోరాడు అన్న నినాదంతోని విద్య రంగ పరిరక్షణ కోసం బహుముఖ పోరాటాన్ని నిర్వహించింది. ముఖ్యంగా యూనివర్సిటీలు భావ్య సమాజంలో మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఏఐఎస్ఎఫ్ సొంతం అన్నారు. ,స్కాలర్షిప్స్ పెంపు కోసం అనేక పోరాటాలు నిర్వహించినది.మహిళలపై జరుగుతున్న దాడులకు, అస్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించినది ఏఐఎస్ఎఫ్,స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో తెలంగాణ పోరాట వారసత్వాన్ని పునికిపుచ్చుకొని విద్యార్థులు పోరాడాలన్నారు.

## ఏజన్సీలో అధ్వానంగా రహదారులు

- ఏకలవ్య స్కూల్ కి రోడ్డు లేని వైనం
- అంబులెన్స్ రాలేనిస్థితిలో గ్రామాలు
- రహదారులను పరిశీలించిన గిరిజన సంఘం



**కారేపల్లి, సెప్టెంబర్ 26, ప్రజా జ్యోతి :** ఏజెన్సీలో ప్రజాసమస్యలు ప్రభుత్వాలకు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు, తెలంగాణ గిరిజన సంఘం మండల అధ్యక్షులు అజ్మీర శోబన్ నాయక్ లు విమర్శించారు. శనివారం సింగరేణి మండలంలోని చీమలపాడు, రేలకాయలపల్లి, బాజుమల్లాయిగూడెం ప్రాంతాలలో రహదారులను గిరిజన సంఘం నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చీమలపాడు నుండి లక్ష్మీపురం, పాత తడకలపూడి వరకు రోడ్డు పై ప్రయాణం నరకాన్ని తలపిస్తుందన్నారు. అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి నెలకొందన్నారు. ఈ రోడ్డు నుండే ఏకలవ్య మోడల్ రెసిడెన్సీ స్కూల్ హాస్టల్ వెళ్లాల్సి ఉంటుందన్నారు. జైత్రంతండా గ్రామపంచాయతీ లో రోడ్డు మొత్తం పగిలిపోయి, నీరు బయటికి పోక చెరువును తలపిస్తుందన్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు అక్కడే నిలిచిపోయి దోమలు, కీటకాలు, పాములు చేరుతున్నాయని తెలిపారు. ప్రజలు రోగాల బారిన పడుతున్న పాలకులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చీమలపాడు – లక్ష్మీపురం పాత తడకలపూడి రోడ్డును వెంటనే పూర్తి స్థాయిలో నిర్మించాలని, జైత్రం తండా గ్రామపంచాయతీలో శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఏకలవ్య మోడల్ స్కూల్ కు ప్రత్యేక రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రజల రవాణా సౌకర్యం పెంచి, ఈ ప్రాంత వాసుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏజన్సీ గ్రామాల సమస్యలపై గిరిజన సంఘం ఆధ్వర్యంలో అందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూడు చిన్, తిప్పల కృష్ణ, మొలకం రమేష్, ఆవుల వెంకటేష్, తిప్పల రణదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## సామిల్ మిల్లులపై దుష్ప్రచారం మానుకోవాలి

- టింబర్ డిపోలు దశాబ్దాల కాలంగా జీవనోపాధి కొనసాగిస్తున్నాయి
- విలేకరుల సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కురివెళ్ల ప్రవీణ్ కుమార్

**ఖమ్మం ప్రతినిధి (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 26,** సామిల్ మిల్లులపై కొందరు వ్యక్తులు చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని, అనేక దశాబ్ద కాలంగా జిల్లా ప్రజలకు సామిల్ యాజమాన్యం తమ సేవలను అందిస్తున్నారని, అటువంటి వారిపై భౌతిక దాడులు చేస్తామని బెదిరింపులకు దిగటం తక్షణమే మానుకోవాలని చాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కురివెళ్ల ప్రవీణ్ కుమార్ అన్నారు.ఖమ్మం గాంధీ చౌక్ లోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కురివెళ్ల ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సోము నరసింహారావు, మాజీ అధ్యక్షులు కొప్పు నరేష్ కుమార్, చిన్ని కృష్ణారావులు మాట్లాడుతూ..శ్రీనివాస్ నగర్ ప్రాంతాలలో గత అనేక దశాబ్దాలుగా సామిల్ టింబర్ డిపోలు కొనసాగుతున్నాయని, జిల్లా ప్రజలకు ఎటువంటి అవసరం వచ్చిన వారి అవసరాలకు అనుగుణంగా కలపను వస్తువులగా తయారు చేసి అందించే చిన్నపాటి వ్యాపారస్తులపై కావాలని కొంత మంది దుమ్ము, ధూళి పడుతుందని సాకుగా చూపి వ్యక్తిగత దూషణలకు దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై త్వరలో జిల్లాకు చెందిన మంత్రులను, ప్రజాప్రతినిధులను, పోలీస్ అధికారులను కలుస్తామని తెలిపారు. సామిల్ వ్యాపారులకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, నిర్మాణం చేసేటప్పుడు ఆ ప్రాంతంలో నివాసాలు లేవని, ప్రస్తుతం నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని కొందరు కావాలని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వాటిని తక్షణమే మానుకోవాలని లేని పక్షములో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ విలేఖర్ల సమావేశంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు బత్తిని నరసింహారావు, సహాయ కార్యదర్శి బాదే రమేష్, కోశాధికారి తల్లాడ రమేష్, సెంట్రల్ ఈసీ మెంబర్స్ రాయపూడి రవి, వీ హరీష్,ఎస్ శేషగిరి రావు, పొట్ల రామనాథం,జి వై నరేష్ రవి, సామిల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డివైన శ్రీనివాసరావు, ఈసీ నెంబర్ తొండల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## సర్వజ్ఞ సూపర్ కిడ్జ్‌లో ఘనంగా "ఫైర్‌లెస్ కుకింగ్ - డాడ్స్ & కిడ్స్"



**ఖమ్మం ప్రతినిధి (ప్రజా జ్యోతి) సెప్టెంబర్: 26:** సర్వజ్ఞ సూపర్ కిడ్జ్‌లో చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించడంతో పాటు తండ్రులు–పిల్లల మధ్య అనుబంధాన్ని మరింత బలపరిచే ఉద్దేశంతో "ఫైర్‌లెస్ కుకింగ్ – డాడ్స్ & కిడ్స్" కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.మంటను ఉపయోగించకుండా తండ్రులు తమ చిన్నారులతో కలిసి వివిధ రకాల రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను తయారు చేశారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. తండ్రులు, పిల్లలు కలిసి వంట చేయడం ద్వారా సహకారం, పరిశుభ్రత, ఆహారంపై అవగాహన, స్వయం ఆధారితత వంటి విలువలు పిల్లల్లో పెంపొందాయి.తండ్రుల సృజనాత్మకత, పిల్లల ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమం తల్లిదండ్రులను పాఠశాల కార్యకలాపాల్లో భాగస్వాములను చేస్తూ, పిల్లల సమగ్ర అభివృద్ధికి పాఠశాల అందిస్తున్న అవకాశాలకు నిదర్శనంగా నిలిచింది. సర్వజ్ఞ చైర్మన్ శ్రీ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మరియు డైరెక్టర్ శ్రీమతి నీలిమ కార్యక్రమంలో పాల్గొని తండ్రులు, చిన్నారులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు కుటుంబ విలువలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా వారు అభినందించారు.



## గంగమ్మ ఒడికి పార్వతీ తనయుడు

- కాకరవాయిలో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం



**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి సెప్టెంబర్ 26:** తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలోని కొత్త బజారులో శ్రీ మహాగణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో కొలువుదీరిన గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు.వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల నడుమ శోభాయాత్రగా తరలించారు. భక్తులు గణపతి నామస్మరణ చేస్తూ, ఉత్సాహంగా నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో కొంగర రాజేష్, బండారి మంజుల, కొంగర విరాంజనేయులు, పడకంటి గణేష్, ఈడబోయిన చరణ్, అబ్రపురి సాయి, పెనుగొండ సాయి బెనర్జి, నునావత్ ఉపేందర్, కొంగరి సాయి కుమార్, దికొండ హరి ప్రసాద్, తావాడబోయిన మధు, పాశికంటి వెంకటేష్, దాసరి రవి, కొంగరి సంతోష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



**వేంసూరు సెప్టెంబర్ 26: ప్రజాజ్యోతి** సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కందుకూరు sc కాలనీలో 40 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, అనువంశిక ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ళ సుధారాణి మాట్లాడుతూ వృద్ధులను ఆదరించాలని సూచించారు. వృద్ధాప్యం అంటే వయస్సు మళ్ళడం కాదని, అది నిలువెత్తు అనుభవమని ఆమె పేర్కొన్నారు. వృద్ధులను చీత్కరించుకోకూడదని, అది వారిలో ఆత్మన్యూనతకు దారి తీస్తుందని ఆమె అన్నారు. వృద్ధులకు చీరలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు.

## ఘనంగా పోషణ మహోత్సవం

- తల్లులు పిల్లలు పోస్ట్ కారం పై అవగాహన పెంచుకోవాలి: సూపర్వైజర్ సుజాత



**కల్లూరు, సెప్టెంబర్ 26 : ప్రజా జ్యోతి** కల్లూరు మండల కేంద్రంలోని పాయపూర్ అంగన్వాడి కేంద్రంలో పోషణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ పర్యవేక్షకురాలు సుజాత మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా చూడడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తల్లులు పిల్లలు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నట్లు సుజాత తెలిపారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారిని తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించి వారికి విద్యతోపాటు పోషకాహారం అందేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు, స్వరాజ్యలక్ష్మి , వెంకటలక్ష్మి , గ్రామస్తులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# ప్రజా దరఖాస్తులు నిర్ణీత గడువులో పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- రీసర్వే చేసిన మొలుగు మాడు గ్రామ రెవెన్యూ డేటా ఎంట్రీ వివరాలను పరిశీలన
- మండలంలోని మొదటి విడుతలో ఐదు గ్రామాలలో చేపట్టిన భూ రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి
- ఎర్రుపాలెం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రీ సర్వే డేటా ఎంట్రీ పక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్





**ఎర్రుపాలెం /మధిర ప్రజా జ్యోతి** ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం మధిర నియోజక వర్గంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, కార్యాలయ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మండల పరిధిలోని మొలుగుమాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహించిన రీసర్వే వివరాలు, డేటా ఎంట్రీ పక్రియను పరిశీలించారు. రీసర్వే అనంతరం రైతులకు నూతన పాసుపుస్తకాల జారీ ప్రక్రియపై అధికారులతో చర్చించి సూచనలు చేశారు. ఎర్రుపాలెం మండలంలో మొదటి విడుదలతో ఐదు గ్రామాలలో చేపడుతున్న భూ సర్వే పంచనామ పత్రాలు, కంప్యూటర్ డెటా ఎంట్రీ విధానంను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడుతూ, భూ రీ-సర్వే ఉద్దేశ్యం, చేపడుతున్న ప్రక్రియపై అవగాహన కల్పించాలని, రైతుల సందేహాలు, అనుమానాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే ప్రతి అంశాన్ని పరిశీలించి నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమ పురోగతిపై ఆరా తీశారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానం, ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్ల కు ఎదురై సమస్యలను పరిషార్కంలో ఎలాంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న వివిధ దస్త్రాలు, స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్లు, సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించారు. ప్రజలకు సంబంధించిన భూ సమస్యలు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, ఇతర సేవలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందించే సేవల విషయంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల సంబంధించిన దరఖాస్తులను సాధ్యమైనంత వరకు మండల స్థాయిలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మండల కార్యాలయాలకు వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మధిర మండలంలోని దెందుకూరు గ్రామంలో రైల్వే మూడవ లైను వలన పలు రైతులకు పోలాలకు వెళ్ళే రోడ్డు ఇబ్బందుల విషయమై రైల్వే అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి సూచనలు ఇచ్చి, తగువిధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మధిర మండల తహసీల్దారు రాంబాబు, ఎర్రుపాలెం మండల తహసీల్దార్ సునీత ఎలిజబెత్, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ శిరీష, సర్వేయర్ రాజశేఖర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎస్సైకి పరామర్శ

**తిరుమలాయపాలెం, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 26:** గణేశ్ నిమజ్జనం సందర్భంగా మండలంలో జరుగుతున్న వేడుకలను పర్యవేక్షించి తిరిగి పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్‌నీ జిల్లా టీజేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ పరామర్శించారు.మంగళవారం రాత్రి గణేశ్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్సై జగదీష్ రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో పోలీస్ స్టేషన్‌కు తిరిగి వెళ్తుండగా భవానీ హోటల్ సమీపంలోని గౌరమ్మ రాయి చెట్టు మూల మలుపు వద్ద వాహనం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఎస్సై జగదీష్‌తో పాటు ఆయన డ్రైవర్ రాకేష్ గాయపడ్డారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.ఈ విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా టీజేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ ఆసుపత్రికి వెళ్లి ఎస్సై జగదీష్, డ్రైవర్ రాకేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి అందుతున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఎస్సై కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. గాయాల నుంచి త్వరగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ప్రమాద ఘటనపై వివరాలను అడిగి తెలుసుకుని, బాధితులకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ ప్రమాదానికి గురికావడం బాధాకరమన్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో టీజేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఇజ్రాయిల్‌తో పాటు ఏలూరు ఆనందరావు, గాదరి బాబు, ప్రథమ చికిత్స వైద్యుడు డాక్టర్ గండమల్ల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం



**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** మండల పరిధిలోని బనిగండ్లపాడు శీలం రామ్మోహన్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వం ఉన్నత పాఠశాల లో బనిగండ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు గ్రహీతలకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి హాజరై అవార్డు గ్రహీతలను జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులు రంగారెడ్డిని,ఉత్తమ రాష్ట్ర ప్రధానోపాధ్యాయులు జంగా గురునాథ రెడ్డిని , జిల్లా ఐఈఆర్టి ఉత్తమ ఉపాధ్యాయురాలు పద్మజ్యోతి లను గ్రామ పెద్దలతో, నాయకులతో కలిసి శాల్వ ,మెమొంటోలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ యన్నం పిచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్ రెడ్డి, పెద్ద గోపవరం సొసైటీ అధ్యక్షులు శీలం అక్కిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు యన్నం సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు అనుమోలు వెంకటకృష్ణారావు, గుడ్డేటి బాబురావు,సొసైటీ డైరెక్టర్లు వేమిరెడ్డి వెంకటరెడ్డి, బాణాల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వేమిరెడ్డి రామిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శీలం కృష్ణారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ పెద్దమళ్ళ మోహన్ రావు, నాయకులు దాసరి మోక్షం, బుంగ పుల్లారావు, బాణాల మోహన్ రావు, తలపురెడ్డి రామిరెడ్డి, తల్లపురెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులను మెరుగైన వైద్య సేవలు అందించాలి

- సీ.ఎం.ఓ కిరణ్ రాజ్ ను కలిసిన ఐఎ న్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్



**సత్యపల్లి సెప్టెంబర్26(ప్రజా జ్యోతి)** స్థానిక కొత్తగూడెం పట్టణం సింగరేణి ప్రధాని ఆసుపత్రి కార్యాలయం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ ను మర్యాదపూర్వకంగా శనివారం కలిసిన ఐఎన్టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ , పోగుల నాగేశ్వరరావు. ఈ సందర్భంగా ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సత్తుపల్లి సింగరేణి ఉద్యోగుల వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని , డిస్పెన్సరీని ఆధునికరించాలని , డిస్పెన్సరీలో గైనకాలజిస్ట్ డాక్టర్ ను నియమించాలని పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా సత్తుపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు , కుటుంబ సభ్యుల అత్యవసర వైద్య సేవ నిమిత్తం సత్తుపల్లి నుండి ఖమ్మం , హైదరాబాద్ , విజయవాడ కార్పొరేట్ హయ్యర్ రిఫరల్ హాస్పిటల్స్ కి పంపించుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.సింగరేణి ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు గతంలో ఉన్న విధంగా, ఉద్యోగులను సత్తుపల్లి నుంచి హయ్యర్ రెఫరల్ హాస్పిటల్స్‌కు పంపే ప్రక్రియను తిరిగి పునరుద్ధరించాలని ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్ కోరారు. గతంలో ఉద్యోగులను సత్తుపల్లి నుంచే హయ్యర్ రెఫరల్ హాస్పిటల్స్‌కు పంపించారని తెలియజేశారు. సత్తుపల్లి నుండి ఉద్యోగులను హైయర్ రిఫరల్ హాస్పిటల్ కు పంపించుటకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోరారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ సానుకూలంగా స్పందించి, సింగరేణి సంస్థ ఉన్నత స్థాయి అధికారులతో చర్చించి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగుల అత్యవసర వైద్య సేవలను నిమిత్తం పునరుద్ధరించాలని కోరారు.

# గంగారంలో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**సత్తుపల్లి సెప్టెంబర్26(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని గంగారం గ్రామంలో శ్రీ వీరభద్ర రజక సంఘం ఆధ్వర్యంలో సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చిట్యాల ఐలమ్మ 131వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చాకలి ఐలమ్మ భవనం వద్ద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పతాకావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం రజక సంఘ సభ్యులు, రజక కుటుంబాలతో కలిసి మోటార్‌సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ ఈ సందర్భంగా సంఘ బాధ్యులు మాట్లాడుతూ ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీరవనిత అని, ఆమె ప్రతిఫలమే మనందరం సుఖసంతోషాలతో ఉన్నామని, ఆమెను భావితరాలకు ,ఆమె చరిత్ర తెలిసే విధంగా నేటి తరానికి తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అభివృద్ధి ప్రదాత దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టి నాయన) , శ్రీ వీరభద్ర రజక సంఘం అధ్యక్షులు కొండపల్లి ఫల్గుణుడు , రజక సంఘ సభ్యులు, రజక కుటుంబాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరనారి చాకలి ఐలమ్మ గారి పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పలువురు పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆరు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభం



**మధిర ప్రజాజ్యోతి** ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె. క్రిస్టఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మధిర మినీ స్టేడియంలో ఆరు రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ శిక్షణ శిబిరం డిస్ట్రిక్ట్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ టి. సునీల్ రెడ్డి గారు మరియు స్టేడియం ఇన్‌చార్జ్ వై. చిన్నీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం కొనసాగుతోంది. అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ వరకు వేములవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ శిబిర ప్రారంభం కార్యక్రమంలో మధిర రెండో వార్డు కౌన్సిలర్ బానోత్ రమణ నాయక్ శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారులకు వసతి మరియు, భోజన సదుపాయాల కోసం ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు క్రమశిక్షణతో శిక్షణ పొంది రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ శిక్షణ శిబిరమునకు కబడ్డీ కోచ్‌లు ప్రవీణ్, శ్రీనివాస్ క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ ఉండగా. బ్యాడ్మింటన్ కోచ్ సునీల్ శిబిర నిర్వహణలో సహకరిస్తున్నారు .క్రీడాకారులకు శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్న నిర్వాహకులను క్రీడాభిమానులు అభినందిస్తున్నారు.

## కొండముచ్చు దాడి.. ఎలక్ట్రిషన్ కు గాయాలు!

- పట్టణంలో ప్రజల భయాందోళన
- నివారణ చర్యలకు ఇంకా ఎన్నాళ్లు?



**కల్లూరు, సెప్టెంబర్ 26: ప్రజా జ్యోతి** పట్టణంలో కొండముచ్చుల సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. శనివారం కల్లూరు మెయిన్ రోడ్ లో విద్యుత్ పనులు చేస్తున్న ఓ ఎలక్ట్రిషన్ పై కొండముచ్చు అకస్మాత్తుగా దాడి చేయడంతో అతని చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఊహించని విధంగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొండముచ్చులు సంచరిస్తున్నప్పటికీ వాటి నియంత్రణకు సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు నివాస ప్రాంతాలు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కొండముచ్చులు సంచరిస్తుండటంతో చిన్నారులు వృద్ధులు మహిళలు బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలుచోట్ల కొండముచ్చులు దాడులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో ఘటన జరిగే వరకు వేచి చూడకుండా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజల కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు అటవీశాఖ అధికారులు సమన్వయంతో కొండముచ్చుల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు పట్టణంలో కొండముచ్చుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

## టాలెంట్ స్కూల్ లో భగవద్గీత శ్లోకాలపై విద్యార్థులకు పరీక్ష



**సత్తుపల్లి సెప్టెంబర్26 (ప్రజాజ్యోతి)** విశ్వహిందూ పరిషత్, ఖమ్మం వారి ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాలపై పరీక్షను శనివారం టాలెంట్ స్కూల్ సత్తుపల్లిలో నిర్వహించారు.ఈ పరీక్షలో టాలెంట్ స్కూల్ 236 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో భగవద్గీతపై ఆసక్తిని పెంపొందించడం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు నైతిక విలువల పట్ల అవగాహన కల్పించడం ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను ఆసక్తిగా అభ్యసించి పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఖమ్మం ప్రతినిధులు, టాలెంట్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలి

- మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సుజాత రామనాథం



**మధిర ప్రజా జ్యోతి** ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం ఆకాంక్షించారు. స్థానిక 18 వ వార్డు లడక బజార్ లో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద శనివారం గణపతి అభిషేకాలు, గణపతి హోమం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలగణేష్ యూత్ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. 13వ రోజు వినాయక విగ్రహం వద్ద వినాయక ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు చేయడంతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో గణపతి హోమం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సామినేని రామనాథం సూర్యదేవర కోటేశ్వ రరావు, మట్టూరి రాజా, చేబ్రోలుభాస్కరరావు, కూరపాటి శ్రీను, ఎర్ర శ్రీనివాసరావు, గరీన నగేష్, మట్టూరి అరవింద్, బాహటం వెంకటేశ్వరరాజు, ముల్లంగి భాను, కాంతాల రవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణదానానికి ముందుకు రండి. రక్తదానం చేయండి!

**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి** ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రి (జీజీహెచ్) బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కూసుమంచి వైద్యాధికారి సాయికుమార్ తెలిపారు.ఈ నెల 28వ సోమవారం ఉదయం 10:30 గంటలకు కూసుమంచి పీహెచ్‌సీలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగి, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఆయన కోరారు.రక్తదానం మహాదానమని, మనం ఇచ్చే ప్రతి చుక్క రక్తం ఆపదలో ఉన్న ఒకరి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని వైద్యాధికారి పేర్కొన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలను వీడి యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.